సంక్రాంతి పోయింది..

శివరాత్రికైనా రోడ్డేస్తారా?

- గుంతలు లేని రోడ్లంటూ సర్కారు హడావుడి
- 9 కిలో మీటర్లు పూర్తిగా దెబ్బతిన్న దంతలూరు రోడ్డు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- కనీసం పట్టించుకోని కూటమి పాలకులు



ధ్వంసమైన దారిలోనే ప్రమాదకరంగా వెళ్తున్న లారీ

దంతలూరు(కొల్లిపర): సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు సిద్ధం చేస్తామని కూటమి సర్కారు గొప్పలు చెప్పింది. కానీ చాలాచోట్ల ఇంకా రోడ్లు అధ్వానంగా దర్శనం ఇస్తూనే ఉన్నాయి. సంక్రాంతి పోయి శివరాత్రి వస్తున్నా.. దంతలూరు రోడ్డు దుస్థితి మాత్రం మారలేదు. కొల్లిపర మండలంలో వల్లభాపురం, మున్నంగి వయా దంతలూరు, కుంచవరం గ్రామానికి అనుసంధానంగా ఉన్న రోడ్డు ధ్వంసమైంది. 13 కిలో మీటర్ల పొడవైన ఈ ఆర్‌ అండ్‌బీ ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతింది. ముఖ్యంగా మున్నంగి నుంచి కుంచవరం మధ్య పరిస్థితి అధ్వానంగా ఉంది. కృష్ణా నదిలో నుంచి వచ్చే 40 టన్నుల ఇసుక లారీలు నిత్యం రాకపోకలు సాగిస్తుండటంతో ఈ దుస్థితి నెలకొంది. ఇక్కడి నుంచి తెనాలిలోని వివిధ పాఠశాలలకు సుమారుగా 4 బస్సులలో విద్యార్థులు నిత్యం వెళ్లొస్తుంటారు. దంతలూరు గ్రామం నుంయి తెనాలి, గుంటూరుకు పనులపై వెళ్లాలంటే గ్రామానికి ఉన్న ఒకే ఒక ప్రధాన రహదారి ఇదే. భారీ ఇసుక వాహనాలు మున్నంగి, వల్లభాపురం నుంచి వస్తూ ఇటువైపుగా తెనాలి, గుంటూరుకు వెళ్తున్నాయి. వాటి దెబ్బకు రోడ్లపై పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వాహనాలు నడపాలంటేనే స్థానికులు వణుకుతున్నారు.

తగిన చర్యలు తీసుకోండి

ఈ మార్గంలో గోతులు కారణంగా బస్‌లో పిల్లలను పాఠశాలలకు పంపే తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లొచ్చేవారికీ అవస్థలు తప్పడం లేదు. ఎప్పుడు ఎటువంటి వార్త వినాల్సి వస్తోందననే భయంతో నిత్యం జీవిస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు, నాయకులు స్పందించి రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కోరారు.

– జ్యోతుల సువర్ణరావు, దంతలూరు గ్రామం

కొత్తగా నిర్మిస్తేనే ప్రయోజనం

ఇప్పటికే ప్రభుత్వం ఈ రోడ్డుకు గుంతలు లేని రహదారులు పేరిట మరమ్మతులకు రూ.40 లక్షలు మంజూరు చేసింది. ఈ నెల 5న ఈ రహదారిని పరిశీలించగా 9 కిలోమీటర్లు వరకు పూర్తిగా దెబ్బతింది. మరమ్మతులు చేసినా ప్రయోజనం ఉండదు. పునర్నిర్మాణం చేయడానికి తగిన నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తాం.

– రాజేంద్రనాయుడు, ఆర్‌అండ్‌బీ డీఈ

కుష్ఠు వ్యాధిపై అవగాహన ఏర్పరుచుకోండి



మాట్లాడుతున్న వహీద్ బాషా

తెనాలిటౌన్: కుష్ఠు వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని లెప్రో సొసైటీ ప్రతినిధి ఎ.వహిద్ బాషా పేర్కొన్నారు. లెప్రో సొసైటీ ఆధ్వర్యంలో బుర్రిపాలెం రోడ్డులోని గుప్తా ఫార్మసీ కళాశాలలో శనివారం కుష్ఠు వ్యాధి – చికిత్స అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ కుష్ఠు నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా తెనాలి పరిసర ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు ఏర్పడితే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సకాలంలో మందులు వాడుకుంటే చాలా వరకు కుష్ఠు తగ్గే అవకాశం ఉందన్నారు. డబల్ హార్స్ ఫౌండేషన్ సహకారంతో వీటిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పలువురు ఫార్మసీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏటీఎంలకు భద్రత కరువు



సొలస బస్టాండు సెంటర్‌లో సెక్యూరిటీ గార్డులేని ఎస్‌బీఐ ఏటీఎం



113 తాళ్లూరు రోడ్డులో ఏటీఎం గది



బస్టాండు సెంటర్‌లోని యూనియన్ బ్యాంకు ఏటీఎం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని పలు బ్యాంకుల ఏటీఎంలు వద్ద పూర్తిగా భద్రత కొరవడింది. ఏటీఎంల వద్ద సంబంధిత బ్యాంకులు సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయడం లేదు. మండల కేంద్రంలోని బస్టాండు సెంటర్‌లో ఉన్న యూనియన్ బ్యాంకు, సొలస బస్టాండు సెంటర్‌లోని ఎస్‌బీఐ, 113 తాళ్లూరు వెళ్లే రోడ్డులోని ఇండియా బ్యాంకు ఏటీఎంలు ఉన్నాయి. ఇటీవల నగదు డ్రా చేసేందుకు ఏటీఎంకు వచ్చిన ఓ అమాయకుడి కార్డు మార్చి మరోచోట నగదు డ్రా చేసిన ఘటన జరిగింది. సంబంధిత ప్రాంతంలో సీసీ కెమారాలున్నా.. పూర్తి స్థాయిలో రికార్డైన చిత్రాల్లో వ్యక్తులు కన్పించని పరిస్థితి. బ్యాంకుల అధికారులు స్పందించి ఏటీఎంల వద్ద సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని ఖాతాదారులు, ప్రజలు కోరుతున్నారు.

ఎల్‌ఐసీ అభివృద్ధిలో ఏజెంట్ల పాత్ర కీలకం

సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ జి.సుధాకర్‌బాబు



మాట్లాడుతున్న సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ జి.సుధాకర్‌బాబు

తెనాలిటౌన్: ఎల్‌ఐసీ అభివృద్ధిలో ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకమని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ మచిలీపట్నం డివిజనల్ సీనియర్ మేనేజర్ డాక్టర్ జి.సుధాకర్‌బాబు పేర్కొన్నారు. ఎల్‌ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని సంస్థ కార్యాలయంలో శనివారం సీనియర్ ఏజెంట్ల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్‌ఐసీ ప్రజలకు భద్రత కల్పిస్తుందని తెలిపారు. ఎల్‌ఐసీలో డిపాజిట్‌ల సేకరణ కూడా జరుగుతుందని, అతి ఎక్కువ వడ్డీ చెల్లించడం జరుగుతుందని చెప్పారు. డీఎస్పీ డి.జనార్ధనరావు మాట్లాడుతూ జీవితానికి భరోసా ఇచ్చే వాటిలో ఎల్‌ఐసీ ముందుంటుదని చెప్పారు. ఎల్‌ఐసీలో అన్ని రకాల సేవలను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అందరూ కష్టపడి పనిచేస్తూ సంస్థ ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. అనంతరం సీనియర్ ఏజెంట్స్ జీవీపీఆర్ సురేష్, కర్నాట ఉమామహేశ్వరరావు, ఎంవీవీఎస్ మోహన్, చుండూరు భాస్కర శశికుమార్, చక్కా వెంకట భాస్కరరావు, చింతగుంట వెంకటకుమార్‌రాజాలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్రాంచీ మేనేజర్ ముప్పాళ్ళ గౌతమ్ భీమరావు, ఏజెంట్ యూనియన్ అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి పాలడుగు రాజశేఖర్, నాయకులు రాజశేఖరరావు, నిమ్మగడ్డ వెంకటేశ్వర రావు, ఎ.రవీంద్రరెడ్డి, జగన్నాధం, ఎస్.రఘు, కళ్ళం శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కష్టాలు తీర్చాలి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ కోరారు. శనివారం ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న నిరాహార దీక్షా శిబిరాన్ని వారు సందర్శించి, కార్మికులకు మద్దతు తెలిపారు. కోర్టు తీర్పుల ప్రకారం తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం కార్మికులు దీక్షలు చేస్తున్నారని, కష్టానికి తగ్గ ప్రతిఫలం మాత్రమే వారు అడుగుతున్నారన్నారు. వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదనం, బి.అంకయ్య, దుర్గా భవాని, సారమ్మ, ఇజ్రాయిల్, గురవయ్య, పిచ్చయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు గెలుపునకు కృషి

కాకుమాను: ఉమ్మడి గుంటూరు,కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎన్నికలలో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కె.ఎస్.లక్ష్మణరావును అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రామారావు పిలుపునిచ్చారు. పెదనందిపాడులోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో శనివారం ఎన్నికల నిర్వహణపై ప్రజా సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఈ నెల 10న లక్ష్మణరావు నామినేషన్ వేయనున్నారని తెలిపారు. రైతు సంఘ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలికి గాయాలు

చేబ్రోలు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పరిధిలోని గరువుపాలెంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఆమె తల పైభాగం, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ : ఐదుగురికి గాయాలు

చేబ్రోలు: బైకులు ఢీకొని ఐదుగురికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం వేజండ్ల అడ్డరోడ్డు సమీపంలో శనివారం జరిగింది. గుంటూరుకు చెందిన భార్యాభర్తలు భరత్ కుమార్, జగదీశ్వరమ్మలు ఇద్దరు పిల్లలతో కలసి బైక్‌పై తెనాలి వైపు వెళుతున్నారు. ఈ సమయంలో మండల పరిధిలోని శేకూరుకు చెందిన సాయి రమేష్ బైక్‌పై అజాగ్రత్తగా వెళుతూ ఢీ కొట్టాడు. ఈ సంఘటనలో గాయపడిన ఐదుగురిని 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

బాధ్యతగా విధులు నిర్వహించండి

అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు

తెనాలిఅర్బన్: విధి నిర్వహణలో బాధ్యతతో వ్యవహరించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సూచించారు. పట్టణంలోని పలు శానిటరీ డివిజన్ కార్యాలయాలను శనివారం ఉదయం ఆయన తనిఖీ చేశారు. అటెండెన్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటాయించిన ప్రాంతాల్లో వ్యర్థాలను తొలగించాలని తెలిపారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకూండా చూసుకోవాలన్నారు. అలాగే సకాలంలో మురుగు కాల్వలను కూడా బాగు చేయాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



తాడేపల్లిరూరల్: తాడేపల్లికి చెందిన ఓ చిన్నారి బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతోంది. జనసేన నాయకులు శనివారం వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు అంబటి తిరుపతి రావు, నియోజకవర్గ నాయకుడు జొన్న రాజేష్ మాట్లాడుతూ..బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న కార్తిక తల్లిదండ్రులు గుణాల నాగదీపిక, ప్రశాంతికి రూ.10 వేల అందజేసినట్లు చెప్పారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి పాప పరిస్థితిని తీసుకెళ్లి.. అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చామని తెలిపారు. కాశిమాల దినేష్, వీరిశెట్టి వెంకటేశ్వరరావు, మేకా నాని, బత్తుల వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది పరిసరాల శుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాలు పరిశీలించి, శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. నీరు నిల్వ ఉన్న గాబులను నాలుగు రోజుల కోమారు శుభ్రం చేసుకోవాలన్నారు. తాగునీటి బిందెలు, ఫ్రిడ్జ్‌ల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు.

ఘనంగా చర్చి శత వార్షిక వేడుకలు



గరికపాడు(కాకుమాను): మండలంలోని గరికపాడులో ఆంధ్ర సువార్తిక సెయింట్ పాల్ లూథరన్ చర్చి శత వార్షిక వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ కనపర్తి నవీన్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని ఆయన తెలిపారు. ప్రభువైన ఏసు క్రీస్తు చూపిన మార్గంలో పయనిస్తూ, ఎదుట వారిపై ప్రేమ,దయ కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా చర్చి నిర్మించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మిక్కిలి పాల్ ప్రసాద్, కూచిపూడి నెహ్రూ, వేముల జయరాజు, కంచర్ల యేహోను, సాతులూరి దాసు, వేముల యెహోషువ, సంఘస్తులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 174 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని దుగ్గిరాలకు చెందిన చుండూరు భాస్కర రావు పంపిణీ చేశారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఉన్నత విద్య చదువుకోవడానికి అవసరమైన ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన్ను పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.ఏడుకొండలు, పసుపులేటి గణేష్, పాఠశాల కమిటీ చైర్మన్ వి. నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు

చేబ్రోలు: రాజధాని ఢిల్లీలో బీజేపీ సంపూర్ణ మెజార్టీ సాధించి విజయబావుటా ఎగురవేయడంపై చేబ్రోలులో బీజేపీ శ్రేణులు శనివారం సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వరికూటి వీర సుధాకర్, పార్టీ మండల అధ్యక్షుడు నారిశెట్టి శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఢిల్లీ ప్రజలు బీజేపీకి పట్టం కట్టారని తెలిపారు. కార్యక్రమంలో మాడా సీతారామయ్య పాల్గొన్నారు.

వైభవంగా పంచముఖ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

తొలిరోజున స్వామివారిని పెళ్లికుమారుడిగా అలంకరణ



సువర్చలా సమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి



స్వామివారిని పెళ్లికుమారుడిగా అలంకరించి ప్రత్యేక పూజలు

తెనాలి: పట్టణ షరాఫ్‌బజారులోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైఖానస ఆగమప్రకారంగా శనివారం ఉదయం విశేష పూజలతో ప్రారంభమయ్యాయి. ఈనెల 14వ తేదీ వరకు ఏడు రోజులు జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజున శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామివారిని, మంగళ వాయిద్యములు వేదమంత్రాల నడుమ పెండ్లి కుమారునిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు పెండ్లి కుమారుడిగా భక్తులచే పూజలు అందుకున్నారు. రాత్రి ఏడు గంటలకు విష్వక్సేన పూజ, అంకురారోపణ, ధ్వజారోహణ పూజా విధులను ఆలయ వంశపారంపర్య అర్చక స్వామి రొంపిచర్ల శ్రీనివాస మూర్తి పర్యవేక్షణలో అర్చకులు ఆర్‌వీ కిరణ్, రమేష్ నిర్వహించారు. శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, సంకీర్తన సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో, మహిళా మండలి సభ్యులు శ్రీహనుమాన్ చాలీసా, శ్రీ విష్ణు సహస్రనామ పారాయణను సామూహికంగా చేశారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు శ్రీ సీతారాముల కళ్యాణం, రాత్రి ఏడు గంటలకు శ్రీ తిరుచ్చి వాహన సేవ పూజలు జరుగుతాయని ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి తెలిపారు. తొలిరోజు స్వామిని పెళ్లి కుమారుడిని చేసిన వేడుకలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్ సభ్యులు మూర్తి వెంకటేశ్వర్లు, జంధ్యం రామారావు, గుడివాడ బాలకృష్ణ, మదుపల్లి చంద్రశేఖర్, మూర్తి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

పీఠాధిపత్యం



ఆర్యవైశ్య కులదేవత శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మ స్థలమైన పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలోని అఖిలభారత శ్రీవాసవీ పెనుగొండ క్షేత్రానికి పీఠాధిపతిగా తెనాలికి చెందిన శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) శనివారం పీఠాధిపత్యం స్వీకరించారు.

– తెనాలి

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం



క్రీడా పోటీల్లో బహుమతులు అందుకున్న ఎన్నారై కళాశాల విద్యార్థినులు

మేడికొండూరు: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, మంచి ఆరోగ్యం దీర్ఘకాలిక రోగాల నుంచి దూరం చేస్తుందని ఎన్నారై కళాశాల ప్రిన్సిపల్ కోట శ్రీనివాసరావు అన్నారు. మేడికొండూరు పరిధిలోని ఎన్నారై ఐటీ కళాశాలలో రెండు రోజులుగా నెహ్రూ యువ కేంద్రం, కళాశాలల సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లాస్థాయి వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్ 100 మీటర్లు, షాట్‌పుట్ ఈవెంట్లు నిర్వహించారు. ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపల్ కోటా శ్రీనివాస్ ప్రారంభించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ యువతకు చదువుతో పాటు క్రీడలు చాలా అవసరమన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. శారీర, మానసికంగా ఏ సమస్యనైనా ఎదుర్కొనే శక్తి కలుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సాధారణమని, ఓటమి, గెలుపుకు నాంది అని తెలిపారు. గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్న నెహ్రూ యువ కేంద్రను అభినందించారు. జిల్లాలో పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు షీల్డ్, ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీహరి, ప్రొఫెసర్ రాము, డాక్టర్ నాగేశ్వర రావు, డాక్టర్ రెహమాన్, డాక్టర్ చంద్రమౌళి, ప్రొఫెసర్ కోటేశ్వరరావు, రవికుమార్, ప్రొఫెసర్ సౌజన్య, ఎన్నారై కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కరుణ, పేస్ సొసైటీ సెక్రటరీ పారుపల్లి రమేష్, కొమ్ము రాజు, పలు ప్రాంతాల నుంచి యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తల్లిపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి




రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు

ఫిరంగిపురం: తల్లిపిల్లలకు వ్యాధినిరోధక టీకాలు తప్పనిసరిగా వేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు అన్నారు. నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, గొల్లపాలెం సబ్‌సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా శనివారం తనిఖీ చేశారు. టీకాల అమలును పరిశీలించారు. ఐఎల్‌ఆర్(వ్యాక్సిన్ భద్రపరచ్చు గది)ని పరిశీలించారు. గర్భిణులు, ఏడాదిలోపు చిన్నారులు, రెండు నుంచి ఐదేళ్ల లోపు వారికిచ్చే వ్యాక్సిన్ వివరాలు యూవీ పోర్టల్‌లో నమోదు చేయాలని సిబ్బంది చెప్పారు. వచ్చే ఏడాదికి వ్యాక్సిన్లు తమ పరిధిలో ఎంత అవసరమో ముందుగా ఆరోగ్య సిబ్బంది సర్వే చేసి మైక్రో వ్యాక్సిన్ ప్లాన్ వేసుకోవాలని సూచించారు. 18 ఏళ్లు పైబడిన వారిలో నాన్ కమ్యూనబుల్ డిసీజ్‌ను ముందుగా గుర్తించాలన్నారు. ఆర్సీహెచ్ పోర్టల్ రిజిస్టర్, వ్యాక్సిన్ క్యారియర్, ఐస్ పోల్స్‌ను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయం వీఎస్‌ఆర్ శాస్త్రి, డాక్టర్ ఫరీనాబేగం, సీహెచ్‌వో వెంకటలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు కె.సుదర్శన్‌రాజు, షేక్, అబ్దుల్ రెహమాన్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: వివిధ ప్రముఖ కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఈ ఏడాది 612 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, జగదీష్ మద్దినేని తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. క్యూస్పైడర్స్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో నేడు 54 మంది విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత సాధించారని పేర్కొన్నారు. కంపెనీ ఉచిత శిక్షణతో పాటు ప్రతిభ ఆధారంగా రూ. 9.5 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. తమ విద్యార్థులకు మంచి ప్యాకేజీలతో కూడిన ఉద్యోగాలు రావడంపై కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్ ఆనందం వ్యక్తం చేశారు.ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, ట్రెనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్స్ సీహెచ్. శ్రీనివాసరావు, కె.సురేష్‌బాబు అభినందించారు.

ముగిసిన 'విజ్ఞాన్ మహోత్సవ్'



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న సినిమా డైరెక్టర్, కె.ఎస్.రవీంద్ర (బాబీ)



వాయిస్ ఆఫ్ విజ్ఞాన్ మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి 'విజ్ఞాన్ మహోత్సవ్' శనివారం ఘనంగా ముగిసింది. మొత్తం 80 ఈవెంట్లను నిర్వహించారు. పలు రాష్ట్రాలకు చెందిన వందకు పైగా యూనివర్సిటీలు, కళాశాలల నుంచి 50వేల మందికి పైగా విద్యార్థులు వివిధ క్రీడల్లో పాల్గొన్నారు. విజేతలకు సర్టిఫికెట్లు, మెమెంటోలతో పాటు రూ.15 లక్షల విలువైన నగదు బహుమతులను అందజేశారు. ''వాయిస్ ఆఫ్ విజ్ఞాన్'' మ్యాగజైన్‌ను అతిథులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

– చేబ్రోలు